సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం । 27 । జనవరి । 2025

అన్ని వర్గాలకు సంక్షేమం

- జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో అట్టహాసంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ బీఎం సంతోష్
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గద్వాల: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనేదే ప్రభుత్వ లక్ష్యమని.. ఈమేరకు కృషి చేస్తున్నామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని స్థానిక పరేడ్‌గ్రౌండ్‌లో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడులతో కలిసి ముందుగా పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ నాయకులు జాతిపిత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాతీయ పతాకాన్ని ఎరుగవేసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం కలెక్టర్ పోలీసు వాహనంలో పోలీసు గౌరవవందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం కలిగిన దేశం మనది. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఎందరో మహానుభావులు కలలు కన్న భారతావనిని నిర్మించటానికి మనమందరం కృషి చేద్దామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పెద్దపీట వేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు నూతన పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తామని అన్నారు.

కోటికి పైగా మహిళల ఉచిత ప్రయాణం

ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసి బస్సుల్లో మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.71 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య సేవలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యనిచ్చిందన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచిందన్నారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 6964మంది ఆరోగ్య శ్రీ వైద్య సేవలను అందుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.17.12కోట్లు వ్యయం అయినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1.44 లక్షల దరఖాస్తులు స్వీకరించి సర్వే చేసినట్లు తెలిపారు.



ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తుంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే రుణ మాఫీ, మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలయ్యాయి. నూతన పథకాలకు సంబంధించి అర్హులు అందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తాం.

\- కలెక్టర్ బీఎం సంతోష్

పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఇంటింటా 'గృహజ్యోతి' వెలుగులు

అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్ అందించే గృహజ్యోతి పథకాన్ని మొదలుపెట్టి 200 యూనిట్లలోపు విద్యుత్ వారికి జీరో బిల్లులు జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు 6.17 లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూరినట్లు తెలిపారు. జీరో బిల్లుల కారణంగా ప్రభుత్వం రూ.15.96 కోట్లు సబ్సిడీగా చెల్లించిందన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసిందని, ఇప్పటి వరకు జిల్లాలో 94,536 మంది లబ్ధిపొందినట్లు తెలిపారు. దీనిద్వారా రూ.5కోటి 69లక్షల 97వేల సబ్సిడీ భారాన్ని ప్రభుత్వం భరించిందని వివరించారు.

58వేల మంది రైతులకు రూ.513 కోట్ల రుణమాఫీ

వ్యవసాయరంగంలో రైతుభరోసా, రైతుల రుణామాఫీ పథకాల అమలుతో పాటు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా నిధుల పంపిణీ చేసిందన్నారు. రైతు రుణమాఫీ కింద జిల్లాలో 58,113మంది రైతులకు రూ.513కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. రైతుభరసా పథకం కింద ఎకరాకు రూ.10వేల నుంచి రూ.12వేలకు పెంచడం జరిగిందన్నారు. ఆత్మీయ భరోసా కింద 10393భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.



పోలీసువందనం స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

460 పాఠశాలల్లో మౌలిక వసతులు

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా 460 ప్రభుత్వ పాఠశాలలోని మౌళిక వసతులు, సివిల్‌వర్క్స్ చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.9.13కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 241 పాఠశాలలో రూ.5.54కోట్లతో పునులు పూర్తిచేసినట్లు మిగిలిన పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నట్లు వాటిని కూడ త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. అలాగే, 450పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వాహణకు రూ.96.33లక్షలు మంజూరీ చేసినట్లు తెలిపారు. ఇక భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, దీర్ఘకాలిక భూసమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జీవించేలా శాంతి భద్రలను పరిరక్షిస్తూ పోలీస్‌శాఖ పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఎందరో త్యాగధనుల ఫలితం

గద్వాల క్రైం: ఎందరో త్యాగధనుల ఫలితంగానే మనమంతా స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నామని ఎస్పీ శ్రీనివాసరావు అన్నా రు. 76 గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఎస్పీ కార్యాలయంలో వద్ద జాతీయ జెండాను ఎగురవేసి మాట్లడారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవ పథకాలకు ఎంపికైన సిబ్బందికి సేవా పథకాలను అందజేశారు. అదే విదంగా గద్వాల కోర్టు ఆవర ణంలో జిల్లా జడ్జి కుష, జిల్లా రావాణా శాఖ కార్యాలయంలో ఇంచార్జ్ డీటీఓ కృష్ణరెడ్డి, డీఎస్పీ, సీఐ కార్యాలయం, పట్టణ, గ్రామీణా పోలీసు కార్యాలయం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ గణపతిరెడ్డి తదితర కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. అదేవిధంగా వివిధ శాఖలకు చెందిన స్టాల్లను కలెక్టర్, ప్రముఖులు పరిశీలించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సభావేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, హోంశాఖ గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

పదేళ్లలో 'పాలమూరు' పూర్తి చేశారా..?

- పేట– కొడంగల్ ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేకపోయారు
- కేసీఆర్, కేటీఆర్‌లకు సంపదలపై ఉన్నధ్యాన ప్రాజెక్టులపై లేదు
- కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే సీఎం అయ్యా
- 20 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- పరిశ్రమలు నెలకొల్పుతుంటే రాజకీయం చేశారు
- చంద్రవంచలో నూతన పథకాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట/కోస్గి: 'పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు– రంగారెడ్డి పూర్తి చేయలేకపోయారు. కనీసం నారాయణపేట– కొడంగల్ ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేదు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయొద్దన్నమా..? సంపదలపైన ఉన్న ధ్యాస కేసీఆర్, కేటీఆర్‌కు ప్రాజెక్టులపై లేకపాయె. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా..రాష్ట్రంలో వారి రాజకీయ మనుగడ ఉండదనే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రాజకీయం చేస్తూ అడ్డుకుంటున్నారు.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి.. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పథకాలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీఎం కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మిత్రులారా ఇందిరమ్మ రాజ్యం.. ప్రజాపరిపాలనలో మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని 13 నెలలు పూర్తి కావొస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం.. ఇందుకు వేదికైన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామాన్ని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు.

పరిశ్రమలు తెస్తే అడ్డుకున్నారు..

పరిశ్రమలు తేవాలని కొడంగల్ నియోజకవర్గంలో 1,300 ఎకరాల భూసేకరణ చేస్తే రాజకీయం చేస్తూ అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం ధ్వజమెత్తారు. వెనకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పెట్టుబడులు తీసుకువస్తుంటే అడ్డుకున్నారన్నారు. ఎప్పటికీ మనం వెనకబడే ఉండాలా..? కొడంగల్ యువకులు ఇంకా లుంగీలు కట్టుకొని బస్టాండ్లలో తిరగాలా..? కొడంగల్‌కు మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీలు రావొద్దా..? అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన మనుషులు కొడంగల్ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సొంతంగా రూ.కోట్లు వెచ్చించానని, కోస్గి బస్టాండ్ నిర్మాణానికి తన సొంత స్థలం ఇచ్చానని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలు రాష్ట్రానికి అంకితం ఇస్తున్నాం.. ప్రతి లబ్ధిదారుడికి మార్చి 31 నాటికి పథకాలన్నీ అందుతాయి.. వలస పోయిన కుటుంబాలు కూడా సొంతూరులో రేషన్‌కార్డులు తీసుకోవాలని సీఎం కోరారు. నిండు మనసుతో కొడంగల్ ప్రజలు అండగా నిలబడితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. దేళ్లలోపు కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మన మాట.. మన బాట.. అభివృద్ధి, సంక్షేమమే అని సీఎం పునరుద్ఘాటించారు.

■ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా నాలుగు కొత్త పథకాలను చంద్రవంచలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు పథకాలు అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలు విజయవంతంగా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బేన్ షాలమ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ రామచంద్ర, గ్రంథాలయ చైర్మన్ విజయకుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కోస్గి మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే

మీ అందరికీ తెలుసు 2023 వరకు కొడంగల్ నియోజకవర్గం ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా న్యాయం మాత్రం జరగలేదు.. 2023 డిసెంబర్ ఎన్నికల్లో పెద్దలు గుర్నాథరెడ్డి, ప్రజలందరూ ఆలోచించి ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని.. ఆ ప్రభుత్వం నాయకత్వం వహించాలని కష్టపడి అత్యధిక మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు తనను ముఖ్యమంత్రిగా నియమించడం కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్‌కు ఎక్కువ సమయం ఇవ్వలేకపోతున్నానని, కానీ 4 కోట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొడంగల్ అభివృద్ధికి పాటు పడుతున్నానన్నారు. నాలుగు కొత్త పథకాలు కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రారంభమయ్యాయంటే ఎంతో గౌరవంగా ఉందన్నారు.





కార్యక్రమానికి హాజరైన ప్రజలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన గుర్నాథరెడ్డి తదితరులు

అధికారులు ఎప్పుడైనా వచ్చారా..

గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో అధికారులు ఎప్పుడైనా గ్రామాల వైపు చూశారా అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో మూడుసార్లు గ్రామసభలు నిర్వహిస్తూ గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.

ఆధార్ మాదిరిగానే రేషన్‌కార్డు

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఎలాగో.. పేదలకు రేషన్ కార్డు అలాగే అని సీఎం పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు వచ్చిందా అంటూ కేసీఆర్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్.. అమెరికాలో కంప్యూటర్ చదువులు చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్న సోయి ఎందుకు రాలేదని దుయ్యబట్టారు. రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తూ.. ఫిబ్రవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

క్రీడాకారులు జిల్లాకు పేరు తేవాలి

గద్వాలటౌన్: క్రీడాకారులు నిర్మాణత్మకమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల కోసం ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగం నుంచి జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మంది క్రీడాకారులు ఎంపిక పోటీలలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆమెతోపాటు కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ అబ్రహం మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. పోటీల అనంతరం 18 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి క్యాంపు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నారు. తరువాత రాష్ట్రస్థాయి పోటీలకు తుది జట్టుకు ఎంపిక చేయనున్నారు.

అపోహలు వద్దు.. అర్హులందరికీ పథకాలు



అరగిద్దలో ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు/కేటీదొడ్డి/ధరూరు: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ఎవరూ అపోహ, ఆందోళన చెందవద్దని.. ఇది నిరంతరంగా కొనసాగే ప్రక్రియ అని కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గట్టు మండలంలోని అరగిద్ద, కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల, ధరూరు మండలంలోని అల్వలపాడులో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డితో కలసి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 రెవెన్యూ మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి, కొత్తగా ప్రవేశ పెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను లాంఛనంగా ప్రారంభించామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అర్హులను గుర్తించడం జరుగుతందని, అలాగే తుది జాబితాను గ్రామసభలో ఆమోదం తర్వాత రైతు భరోసా, ఇదిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు వంటి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులకు రైతు ఆత్మీయ భరోసా కింద వారి ఖాతాలో రూ.6 వేలు జయచేయనున్నట్లు, అలాగే అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు వర్తించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ హనుమంతు, గట్టు తిమ్మప్ప, బండారి భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ సన్నిధిలో పోతుగడ్డ చిత్ర యూనిట్



ఆలయంలో పోతుగడ్డ చిత్ర యునిట్



జోగులాంబ ఆలయంలో సినీనటి అన్నపూర్ణ

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రాన్ని పోతుగడ్డ చిత్ర యూనిట్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్ కుమార్ చిత్ర యునియట్‌కు సాదర స్వాగతం పలికారు. చిత్ర హిరో పృథ్వి దండమూరి, హిరోయిన్ విస్మయశ్రీ, దర్శకుడు రక్షవీరం, ప్రధాన పాత్రధారులు నరేస్, శత్రు, ప్రశాంత్ కార్తీ, రాహుల్, శ్రీవాత్సవ్.. సినిమా విజయం సాధించాలని అమ్మవారిని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 30వ తేదీన సినిమా విడుదలవుతున్నట్లు తెలిపారు.

సీనియర్ నటి అన్నపూర్ణ ప్రత్యేక పూజలు

అలంపూర్ ఆలయాలను సీనియర్ సినీ నటి అన్నపూర్ణ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

కాల్వకు గండి.. నీట మునిగిన పంటలు

- వివరాలు 8లో..

పాలమూరు పరేడ్ మైదానంలో..



మహబూబ్‌నగర్‌లో గ్రామదేవత వేషధారణలో..



గద్వాలలో గిరిజన వేషధారణలో..



జయహో..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూవాడ త్రివర్ణ శోభితంగా మారాయి. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలువురు తమ విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. జాతీయ పతాకం చేతబూని జయహో భారత్ అంటూ విన్యాసాలను ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో వివిధ శాఖల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శకటం ప్రదర్శన



గద్వాలలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలంటూ..



మహబూబ్‌నగర్‌లో..



వనపర్తిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ..



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ఏర్పాటుచేసిన శకటం



పాలమూరులో సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఇక్కడ విధులు నిర్వహించడం గర్వంగా ఉంది

- శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహించడం గర్వంగా ఉందని సీఈ రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈగలపెంటలోని శక్తిసదన్ కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ కేంద్రం జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన టార్గెట్ 2,000 యూనిట్లను అధిగమించి ఉత్పత్తి చేశామన్నారు. ఇంకా లోడ్ డిస్పాచ్ అడిగిన వెంటనే విద్యుత్తు ఉత్పత్తి సరఫరాకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఆణిముత్యం లాంటి కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఈ ఏడాది గణనీయంగా సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటిని తరలించామన్నారు. యాజమాన్యం ఇటీవల కేంద్రంకు ముప్పై మంది నూతన ఏఈలను కేటాయించిందని తెలిపారు. ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, కేంద్రం యావత్తు ఇంజినీర్లు ఉద్యోగులు పాల్గొన్నారు. తదుపరి ఎస్పీఎఫ్ ఆర్ఐ రవి పర్యవేక్షణలో ఎస్ఐలు అనూప్, శ్రావణ్, పోలీసుల నుంచి వందన స్వీకరించారు.



ఈగలపెంటలో శక్తిసదన్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఈ రామసుబ్బారెడ్డి

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి యువకుడు దుర్మరణం



అభిషేక్(ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్ సమీప మార్గంలో అభిషేక్(20) అనే యువకుడు ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వివరాలు.. కర్నూలు జిల్లా పంచాలింగాల గ్రామానికి చెందిన అభిషేక్ ట్రాక్టర్ మీద డ్రైవర్ కమతం రాజుతో కలిసి ఉండవెల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో కుక్క అడ్డురావడంతో ట్రాక్టర్ సడెన్ బ్రేక్ వేశాడు. అభిషేక్ టైరు కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా కమతం రాజు వాళ్ల అన్న కమతం దేవదానం కుమారుడు అభిషేక్. కుమారుడి మృతి చెందడంతో తమ్ముడు రాజుపై దేవదానం ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహనీయుల త్యాగాలు మరవద్దు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ సాంబయ్య

- పదోపటాలం కమాండెంట్ ఎన్వీ సాంబయ్య

ఎర్రవల్లి: ఎందరో మహనుభావుల త్యాగాల ఫలితంగానే ఈరోజు మనమంతా స్వతంత్రంగా జీవిస్తున్నామని.. అలాంటి వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పదో పటాలం కమాండెంట్ ఎన్వీ సాంబయ్య కోరారు. ఆదివారం ఎర్రవల్లి మండలం బీచుపల్లి పదోపటాలంలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినందున గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం కన్న కలలను సాకారం చేసేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం పటాలంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన విశ్రాంత సిబ్బందిని కమాండెంట్ అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ టి.పా ణి, ఆర్ఐలు రాజు, వెంకటేశ్వర్లు, ఆర్పీ సింగ్, రాజారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామ శివారులో నిర్మిస్తున్న భారత్‌మాల రోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. బింగుదొడ్డి సమీపంలోని చెరువులో భారత్‌మాల రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్.. మట్టిని తరలించారని తెలిపారు. గ్రామంలో పాఠశాల భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పటి వరకు సగం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు పూర్తిచేసిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



బెబ్బులికి పూర్వవైభవం



శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు ప్రధాన కూడలిలోని ఫారెస్టు డివిజనల్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన పెద్ద పులుల బొమ్మలు ఎట్టకేలకు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. గత కొన్నాళ్లుగా ఇక్కడి పెద్ద పులుల బొమ్మలు రంగులు వెలసి కళావిహీనంగా మారిన వైనంపై ఈ నెల 23న 'సాక్షి' దినపత్రికలో 'లక్ష్యం నెరవేరిందో.. నిర్లక్ష్యం ఆవహించిందో' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అటవీ శాఖ అధికారులు పెద్ద పులుల బొమ్మలకు రంగులు వేశారు. దీంతో ఆదివారం గణతంత్ర వేడుకలకు వచ్చిన వారికి నిజమైన పెద్ద పులులా కనిపించి ఆశ్చర్యపరిచాయి.

- మన్ననూర్

సాక్షి ఎఫెక్ట్..



కాల్వకు గండి.. నీట మునిగిన పంటలు

మల్దకల్: మండలంలోని చర్లగార్లపాడు శివారులో 106 ప్యాకేజీ కాల్వకు ఆదివారం గండి పడటంతో పంటలు నీట మునిగాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వ షట్టర్‌ను కొందరు రైతులు మూసి వేయడంతో నాగర్‌దొడ్డి, కుర్తిరావులచెర్వు మీదుగా తూంకుంటకు వెళ్లే కాల్వలో నీటి ఉధృతి పెరగడంతో పాటు కాల్వలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వ తెగిపోయింది. నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నీటి సరఫరాను నిలిపి వేశారు. మొత్తం 25 ఎకరాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, పొగాకు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు సుధాకర్, ధర్మన్న, నాగరాజు, ప్రేమ్‌రాజ్, ప్రసాద్, కర్రెన్న, బుడ్డన్న, వెంకటన్న తెలిపారు. నష్ట పరిహారం అందించడంతో పాటు కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

గజ వాహనంపై అభయాంజనేయుడు



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. రెండోరోజు ఆదివారం ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గజ వాహన సేవ నిర్వహించారు. భక్తుల భజనల నడుమ స్వామి వారు గజ వాహనంపై ఊరేగారు. అర్చకులు, భక్తులు శివస్వాములు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ప్రశంసా పత్రాలు అందజేశారు.

- గద్వాల



గద్వాల మహిళా సమాఖ్య సంఘానికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యేలు



రోహిత్‌నిహాల్ డీపీఆర్ఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్

వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ

భీమన్న, సీనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్ శాఖ

ఆదిల్, కంప్యూటర్ ఆపరేటర్, సివిల్‌సప్లై శాఖ

ఎల్లారెడ్డి, గద్వాల మున్సిపాలిటీ మేనేజర్



బషీర్, ఏఈ, పంచాయతీరాజ్, గద్వాల

దివ్య, జిల్లా ఆస్పత్రి వైద్యురాలు

రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్, ఎస్సీ కార్పొరేషన్

సక్రియనాయక్, డీఏఓ, వ్యవసాయ శాఖ

శ్రీలత, ఏఓ, ధరూరు



మల్లిఖార్జున్, సీ.అసిస్టెంట్, ఎస్సీ సంక్షేమశాఖ

నాగార్జున్‌గౌడ్, ఏపీఓ, జిల్లా ప్లానింగ్ కార్యాలయం

తిమ్మన్న, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఐకేపీ మెప్మా

రమేష్, విద్యుత్తు శాఖ ఏడీ

నల్లన్న, జిల్లా ట్రెజరీ కార్యాలయ అటెండర్

చెన్నయ్య, ఎంపీడీఓ, గట్టు

రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

సరోజ, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి



వీరభద్రప్ప, గట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్

మల్లికార్జున్, కలెక్టరేట్ ఏఓ

రాఘవేంద్రగౌడ్, అదనపు కలెక్టర్ సీసీ

చైతన్య, ధరణి ఈడీఎం ఆపరేటర్

మధుసూదన్, కలెక్టరేట్ అటెండర్

సతీష్, ఎస్పీ కార్యాలయం

టంగుటూరి శ్రీను, గద్వాల సీఐ

శ్రీకాంత్, గద్వాల రూరల్ ఎస్ఐ



ప్రశంసా పత్రం అందుకుంటున్న గద్వాల ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు

కొనసాగిన రిలే నిరాహార దీక్ష

రాజోళి: ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా మండలంలోని పెద్ద ధన్వాడలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాలుగో రోజుకు చేరింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెద్దధన్వాడతో పాటు చుట్టు పక్కల 10 గ్రామాలకు పైగా ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రభావం పడుతుందని, ప్రజల ఆరోగ్యాలు గాల్లో దీపాలుగా మారతాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఫ్యాక్టరీ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తుంటే కూడా ఫ్యాక్టరీ పనులను చేయాలనుకోవడం మంచిది కాదని అన్నారు. మాన్‌దొడ్డి, చిన్నధన్వాడ, తుమ్మిళ్ల, ననూరు, ప్రజలు పాల్గొన్నారు.